'సాధించింది ఎంతో ఉంది. సాధించాల్సింది ఇంకా ఉంది' అని సగర్వంగా చెబుతున్నది బీఆర్ఎస్. తాను చేసిన అభివృద్ధే తమను గెలిపిస్తుందన్న ధైర్యం పార్టీ శ్రేణులలో బలంగా కనిపిస్తున్నది.

ఐదు దశాబ్దాలు ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించినా సాధించింది ఏమీ లేదు కానీ.. ఆరు ఉత్తుత్తి పథకాల తోక పట్టుకుని.. గెలుపు గోదారి ఈదాలని ప్రయత్నిస్తున్నది ఓ అంతరించిపోతున్న పార్టీ. ఇక్కడైతే పదేండ్ల నుంచీ జనం పట్టించుకోవడం మానేశారు సరే.. గెలిచిన చోటైనా కించిత్ అభివృద్ధి సాధించారా అంటే.. అదీ లేదు. కప్పల గొడవలు, కప్పల తక్కెడ బేరాలతోనే పుణ్యకాలమంతా గడిచిపోతుంది. ఓటేసిన పాపానికి సామాన్యులు నరకం అనుభవిస్తారు. ఏ రాష్ట్రంలో అయినా ఇదే భస్మాసుర హస్తం కథే. మొత్తంగా దేశాన్ని పాలించిన రోజుల్లో కూడా అవినీతి కేసులు, పచ్చనోట్ల సూట్ కేసులే! భ్రమలు కల్పించో, ఉద్యోగాలు రెచ్చగొట్టో, జాలి కలిగేలా యాచించో, మనసు మార్చుకునేలా ప్రలోభపెట్టో పబ్బం గడుపుకోవాలను కునే వారికి కూడా సబ్బండ వర్గాలన్నీ కలిసి బలమైన హెచ్చరిక చేయాలి.

మొన్నటితో నిన్నటిని..
నిన్నటితో నేటిని
సరిపోల్చుకుని..
అభివృద్ధిని నిర్ధారించుకుని..
సరైన పార్టీనే ఎన్నుకోవాలి. తెలంగాణ భవితకు మన ఓటుతో భరోసా ఇవ్వాలి.



## ప్రత్యేక పరిస్థితులు

ప్రతి ఎన్నికా గొప్పదే. కానీ కొన్ని ఎన్నికలు మరింత కీలకమైనవి. మొత్తంగా ఓ జాతి ప్రయోజనాలతో ముడిపడినవి. కుటుంబ చరిత్ర, పెరిగిన వాతావరణం, బంధుగణం, స్నేహితుల ప్రభావం.. ఇలా రకరకాల కారణాలతో మనం వివిధ రాజకీయ పార్టీలను అభిమానిస్తాం. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా, అభ్యర్థితో నిమిత్తం లేకుండా, అభివృద్ధిని పరిగణనలోకి తీసుకోకుండా ఆ పార్టీకే ఓటేస్తాం. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. ఎవరి అభిప్రాయాన్నీ తప్పు పట్టలేం. కానీ, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం ఆ మూసలోంచి బయటికి రావాలి. రాష్ట్ర ప్రయోజనాల్ని, ఉద్యమ పార్టీ గెలవాల్సిన అవసరాన్ని గుర్తించాలి. సంక్షేమ పథకాలు ఆగిపోకుండా జాగ్రత్తపడాలి. అందులోనూ, తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు ఓ కీలకమైన మజిలీలో ఉన్నది. పదేండ్ల ప్రగతికి, యాభై ఏండ్ల దుర్గతికి మధ్య యుద్ధమిది. స్వరాష్ట్రం తెచ్చినవారికి, స్వాభిమానం చచ్చినవారికి మధ్య పోరాటమిది. పసి రాష్ట్రాన్ని ఎలాగైనా సొంతం చేసుకోవాలనే కసి ప్రత్యర్థుల కళ్లలో కనిపిస్తున్నది. ఢిల్లీలో కత్తులు నూరుకునే పార్టీలు ఇక్కడ మాత్రం కనిపించని పొత్తులు చేసుకుంటున్నాయి. జిత్తులు ప్రయోగిస్తున్నాయి. వాటిని చిత్తు చేయడానికైనా.. ఓటర్లు స్తబ్ధత వీడాలి. జాతీయ పార్టీల ఉమ్మడి ప్రత్యర్థి.. కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలి.



## తెలంగాణ ప్రయోజనాలు

ఎన్నికలు అనగానే రకరకాల ఊరింపులు ఉంటాయి. నోట్లు పంచేవారు, మద్యం పారించేవారు, కుక్కర్లు, స్పోర్ట్స్ కిట్లు, గడియారాలు.. రకరకాల బహుమతులతో మన మతి తప్పించాలని ప్రయత్నించేవారు.. చాలా మందే ఉంటారు. మీ కులం, మీ మతం, మీ ప్రాంతం.. అంటూ దురభిమానాన్ని పోషించేవారూ లెక్కలేనంత మంది. ఆ ప్రలోభాలు, ప్రభావాలను సాధ్యమైనంత దూరం ఉంచాలి. ఒక్కసారి అమ్ముడుపోయామంటే.. ఎవరో వచ్చి రాష్ట్రాన్ని అమ్ముకు పోతున్నా ప్రశ్నించే నైతిక హక్కు మనకు ఉండదు. చివరికి మన ఆస్తుల్ని కబ్జా చేస్తున్నా, మన పనులు చేసిపెట్టడానికి లంచం అడుగుతున్నా.. ఎదురుతిరగలేని ఆత్మన్యూనత మనల్ని వెంటాడుతుంది. సమర్థత ఆధారంగానే ఓటువేయండి.బాధ్యత కలిగిన ఓటరుగా, వాస్తవాలు తెలిసిన ఉన్నత విద్యావంతుడిగా.. తోటి ఓటర్లకు కర్తవ్యదీక్షో పదేశం చేయండి.

* * *

**నవంబరు 30**
**గుడికెళ్లినంత ప్రశాంతంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లండి.**
**అవును. క్యూ పెద్దగానే ఉండవచ్చు. మీ ఇష్టదైవం దర్శనానికి వెళ్లినప్పుడు అంతకంటే పదింతలు పెద్ద వరుసలో నిలుచున్న విషయం గుర్తు చేసుకోండి. ఆలయానికి అగరొత్తులతో, కొబ్బరికాయతో వెళ్లినట్టు.. ఓటర్ ఐడీ, ఓటర్ స్లిప్ తీసుకెళ్లండి. సెల్‌ఫోన్ ఇంట్లో వదిలేసి వెళ్తేనే మంచిది. ఆ వరుసలో మీ ముందు నిలబడిన వ్యక్తితోనో, వెనుక నిలబడిన మనిషితోనో చర్చలు, వాదనలు వద్దు. పోలింగ్ కేంద్రం పరిసరాల్లో ప్రచారాలు, ప్రలోభాలు జరుగుతున్నట్టు అనిపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయండి. మీ వంతు రాగానే.. పోలింగ్ యంత్రం దగ్గరికి వెళ్లండి. తెలంగాణ గుండెచప్పుడు వినిపించే పార్టీకే ఓటేయండి. పౌరుడిగా మీరు గెలిచారు.**
**అభినందనలు.**

